
ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.9 : కనిష్ఠం 22.1



ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

పెద్దకొడప్‌గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ పది, ఇంటర్ తరగతులకు ప్రవేశాలు ప్రారంభం అయినట్లు పెద్ద కొడప్‌గల్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ కిషోర్ సింగ్ తెలిపారు. గతంలో పది, ఇంటర్ ప్రవేశాలకు అవకాశం ఇచ్చిన ఉపయోగించుకోని ఈ ప్రత్యేక ప్రవేశాలను ఉపయోగించు కోవాలని తెలిపారు. ఈనెల 2 నుంచి 12 వరకు అపరాధ రుసుముతో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9866343898 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లు
ఇల్లు లేని వారికి
ఇంటి స్థలం &
₹5 లక్షలు
ఉద్యమకారులకు
250 చ.గ. ఇంటి స్థలం



- ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు సర్కారు సన్నాహాలు
- ప్రజాపాలన విజయోత్సవాలలో లబ్ధిదారుల ఎంపిక
- తొలివిడుతలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు
- జిల్లాలో 14వేల ఇళ్లు మంజూరయ్యే అవకాశం
- ప్రజాపాలనలో 2.5 లక్షల దరఖాస్తులు
- ఇప్పటికే ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు పూర్తి
- కమిటీల ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక ప్రక్రియ
- ఇటీవల మార్గదర్శకాలు సైతం విడుదల

ఇందిరమ్మ ఇళ్లపై చిగురిస్తున్న ఆశలు



కామారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇల్లు లేని నిరుపేదల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. సొంత స్థలం ఉండి ఇప్పటివరకు ఇల్లు నిర్మించుకోలేకపోయిన వారికి ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చాక ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించింది. అర్హులైన వారిని ఎంపికచేసి ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. కానీ 10 నెలలుగా దీనిపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశారు. అయితే ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఈ పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టి ఇళ్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లాలో కమిటీల ఏర్పాటు పూర్తయింది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుపై ఇటీవల ప్రభుత్వం మార్గదర్శకాలు సైతం విడుదల చేసింది. దీంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రజాపాలనలో 2.45లక్షల దరఖాస్తులు

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఆ ప్రభుత్వ హయాంలో విజయవంతంగా అమలుచేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయించింది. గత జనవరిలో ప్రజాపాలన గ్రామసభల్లో అర్హుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులను కూడా స్వీకరించింది. జిల్లావ్యాప్తంగా 2,45,541 ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన దరఖాస్తులు వచ్చాయి. కాగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గృహ నిర్మాణశాఖకు ఇందిరమ్మ ఇళ్ల అమలు బాధ్యతను అప్పగించింది. జిల్లాలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం మొదటి విడుత కింద మంజూరు చేయనుంది. ఈ లెక్కన కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలలోని మొత్తం 14వేల ఇళ్ల వరకు వచ్చే అవకాశం ఉంది. స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయనున్నారు. స్థలంలేని వారికి జాగా ఇవ్వనున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు, రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారులను ఎంపికచేయనున్నట్లు తెలుస్తోంది.

లబ్ధిదారుల ఎంపిక కోసం కమిటీల నియామకం పూర్తి

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రత్యేక సాఫ్ట్ వేర్‌తో పాటు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీలను ఇప్పటికే నియామకం చేపట్టారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేశారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు గ్రామ అభివృద్ధిపై అవగాహన కలిగిన మరో ముగ్గురు గ్రామస్థులు వీరిలో ఎస్సీ,ఎస్టీ,బీసీలకు స్థానం కల్పించారు. అదేవిధంగా మున్సిపాలిటీల పరిధిలో ఆయా వార్డులలో కౌన్సిలర్ చైర్మన్‌గా వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా మహిళా పొదుపు సంఘాల నుంచి ఇద్దరు వీరితోపాటు అవగాహన కలిగిన వారి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీలను సభ్యులుగా తీసుకున్నారు. ఈ కమిటీల నియామకంలో కాస్త వివాదం నెలకొన్నప్పటికీ అధికారులు సరిచేసి పూర్తిస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల నేతృత్వంలో ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు.

తొలి విడుతలో ఖాళీ స్థలం ఉన్నవారికే..

పేదల సొంతింటి కల సహకారం చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మొదట స్వంత స్థలం ఉన్న పేదలకే వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఇందిరమ్మ ఇంటి కోసం వచ్చిన దరఖాస్తులో మొదట అర్హులు ఎంతమంది ఉన్నారనేది గుర్తించనున్నారు. ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసేందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు ఆధారంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో వార్డుల వారిగా క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించనున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావాలంటే తప్పనిసరిగా నిరుపేదలై ఉండాలి. పక్క ఇళ్లు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే అవకాశం లేదు. సొంత స్థలం ఉంటే ఆ స్థలం సొంతమేనా లేదా ఏ విధంగా సంక్రమించిందనే వివరాలు సేకరించనున్నారు. గ్రామ, వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదుచేయనున్నారు.

మార్గదర్శకాలు ఇవి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలను జారీచేసింది. దీని ప్రకారం మహిళ పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి ఇందులో దరఖాస్తుదారు పేరు ఉండాలి. దరఖాస్తు దారు

(...మిగతా 8వ పేజీలో)





ఆ రహదారి యమ డేంజర్!

- 161 జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు
- పశువుల సంచారంతో తరుచూ ప్రమాదాలు
- భద్రత పెంచాలని వాహనదారుల వేడుకోలు

7

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు!

- వేల్పూర్‌లో రోడ్డుకు ఆనుకునే విద్యుత్ నియంత్రికలు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

7





ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

కామారెడ్డిటౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని భూ సంబంధ, రుణాలు, రెండుపడక గదుల ఇళ్ల మంజూరు వంటి వాటిపై ఆయా శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బాలవివాహ రహిత భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతకముందు జాతీయ వాయుకాలుష్య దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కాగా కలెక్టరేట్ ముందు వీఆర్‌ఏలు ధర్నా కార్యక్రమం చేపట్టారు. జీవోనంబర్ 81 ప్రకారం 61 ఏళ్లు నిండిన వారి పిల్లలకు వారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. వారికి సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, విక్టర్, ఆర్‌డీఓ రంగనాథ్‌రావు, జడ్పీ సీఈవో చందర్‌నాయక్ తదితరులున్నారు. అలాగే పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, పాడి పరిశ్రమద్వారా చేపట్టిన ఏడాదిలో ఎన్నో విజయాలు పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

వర్చువల్‌గా పారా మెడికల్ కళాశాల ప్రారంభం





మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లాలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పారామెడికల్ కళాశాలలను ప్రారంభించారు. అందులో నూతనంగా కామారెడ్డి మెడికల్ కళాశాల వద్ద సైతం ఏర్పాటు చేసిన కళాశాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, అదనపుకలెక్టర్ విక్టర్, ఆర్‌డీఓ రంగనాథ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, తదితరులు కార్యక్రమాన్ని వీక్షించారు.

కాంగ్రెస్ పార్టీవి 6 అబద్ధాలు.. 66 మోసాలు

- కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ కరపత్రాల ఆవిష్కరణలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

కామారెడ్డి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినవి గ్యారెంటీలు కాదని, 6 అబద్దాలు.. 66 మోసాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార విమర్శించారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టు అయిందని, ఎన్నికల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ పార్టీ అనేకరకాల అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని తీరా ఇప్పుడు వాటి అమలుకు మీన మేషాలు లెక్కిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న మహిళలకు ప్రతీనెల రూ.2,500 ఆర్థికసాయం, 18 ఏళ్లు నిండి చదువుకునే ప్రతీ అమ్మాయికి స్కూటీ, ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్ష ఆర్థిక సహాయం తులం బంగారం, రైతుభరోసా, కైలు రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేల సాయం ఎక్కడ అమలు కావడం లేదని అన్నారు. వరితోపాటు 10 పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ అని చెప్పి ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే చెల్లిస్తామని కండీషన్లు పెడుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కింద ఇల్లు లేని వారికి ఇంటిస్థలం, రూ.5లక్షలు, ఉద్యమకారులకు 250 చ.గ. స్థలం, పొదుపుసంఘాల వడ్డీలేని రుణాలు అలా అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసారన్నారు. ఇక గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్‌లు కొద్దిమందికి మాత్రం అమలుచేస్తూ మిగిలిన వారికి మొండిచేయి చూపిందని అన్నారు. నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకులు మురళీధర్‌గౌడ్, రాష్ట్రకార్యవర్గసభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, నీలం చిన్నరాజులు, రంజిత్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, లింగరావు, వేణు పాల్గొన్నారు.



కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ పేరుతో ఉన్న కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిండుగా నిజాంసాగర్ ప్రాజెక్టు



సాగుకు సమాయత్తం

- యాసంగిలో 1.35 ఎకరాలకు సాగర్ నీరు అందించేందుకు ప్రణాళిక
- వరి సాగుకే రైతుల ఆసక్తి
- నిజాంసాగర్ ఆయకట్టు కింద జోరుగా వరి నారుమళ్లు
- అధిక దిగుబడి వరి విత్తనాలపై రైతాంగం దృష్టి

నిజాంసాగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల వర ప్రసాదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు కిందట యాసంగికి సాగుకు రైతాంగం సమాయత్తమవుతోంది. ఈ ఏడాది నిజాంసాగర్ ప్రాజెక్టు కిందట 1.35 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేసేందుకు రైతులు ఇప్పటికే సాగు భూముల్లో వరి సాగు చేశారు. వర్షాకాలంలో నిజాంసాగర్ ఆయకట్టు కింద ముందస్తుగానే జూలై, ఆగస్టు మాసంలోనే రైతులు వరి నాట్లు వేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆగస్టు చివరి వారంలో ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు భారీ వరద నీరు వచ్చి చేరి నిజాంసాగర్‌లో పూర్తి నీటి సామర్థ్యానికి చేరుకుంది. ఏడాది యాసంగి నాటికి నిజాంసాగర్‌లోపూర్తి నీటి సామర్థ్యం కలిగి ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టులో నిండు జలాలు ఉండటంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. యాసంగిలో లక్ష్యాన్ని మించి వరి పండించేందుకు సిద్ధమవుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405 అడుగులకుగాను 1404.75 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ఏడాది నీటి పారుదల శాఖ అధికారులు లక్షా 35 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో ఆయకట్టు కింద వరిసాగు చేయాలని ఆలోచనలు ఉన్నప్పటికీ ప్రభుత్వపరంగా రాయితీపై విత్తనాలు సరఫరా చేయకపోవడం పట్ల రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే ప్రణాళికను సిద్ధం చేయలేకపోయారు. ఇదిలా ఉండగా ప్రాజెక్టు నాన్ కమాండ్‌ఏరియాలోని రైతాంగం ఇప్పటికే చెరువులు, బోరు బావుల కిందట వేసిన వరి నారుమళ్లు పెరగడంతో నాటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏడాది నిజాంసాగర్ ఆయకట్టు కింద వర్షాకాలంలో ఆలస్యంగా నాట్లు వేసినప్పటికీ అధిక దిగుబడి రాకపోవడంతో రైతాంగం ఆందోళన చెందారు. నిజాంసాగర్ ప్రాజెక్టు మంజీరా నది వెంట ఉన్న రైతాంగం వరి సాగుపైనే ఆసక్తి చూపతున్నారు. ఈ ఏడాది నిజాంసాగర్ ఆయకట్టు కింద లక్ష్యాన్ని మించి వరిని సాగు చేసేందుకు రైతాంగం సిద్ధమవుతోంది. నిజాంసాగర్ ఆయకట్టు కింద సిరులు పండించి ఉమ్మడి జిల్లాను ధాన్య గారంగా కీర్తిని చాటనున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూర్తి నీటి సామర్థ్యం పుష్కలంగా ఉండటంతో యాసంగిలో సాగునీటికి తిప్పలు రావని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వరి సాగుకు సైతం నీటి సమస్యలు ఉండబోవని చెప్తున్నారు.

వచ్చిన ఏడాదిలోనే 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



అబ్బాపూర్(బి)తండాలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 50వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సిరన్‌పల్లి, అబ్బాపూర్(బి)తండాల లో రూ.10లక్షల చొప్పున గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాపూర్(బి) తండాలో విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బంగారు తెలంగాణ సాధిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యం, రోడ్డు, ఇరిగేషన్ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. వరిపంటకు మద్దతు ధర చెల్లించడంతో పాటు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో కోటి రూపాయల వ్యయంతో అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు అందిస్తున్న మెస్ చార్జీలను 40శాతం పెంచి ఇస్తున్నామని దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని అన్నారు. అనంతరం మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. పాఠశాలలో పాడైపోయిన సోలర్ గ్రీజర్‌కు వెంటనే మరమ్మత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాలరాజు గౌడ్, కిరణ్ కుమార్, రాజేశ్వర్, పీర్‌సింగ్, ఎస్‌కే బాబు, ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాక్టలీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులలో గెస్ట్ ఫ్యాక్టలీగా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత తెలిపారు. పీజీసీఆర్‌టీ నర్సింగ్-02, మ్యాథ్స్ సీఆర్‌టీ-01, పీఈటీ-01 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత కోర్సులలో శిక్షణ పొందిన మహిళ అభ్యర్థులు ఈ నెల 5లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

లింగంపేటలో..

లింగంపేట,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పాఠశాల, కళాశాలల్లో బోధించేందుకు టీచింగ్ స్టాఫ్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ఎస్‌వో వాసంతి తెలిపారు. పాఠశాల స్థాయిలో గణితం బోధించేందుకు సీఆర్‌టీ, కళాశాల స్థాయిలో తెలుగు బోధించేందుకు పీజీ సీఆర్‌టీకావాలని ఆమె తెలియజేశారు. బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తులను ఈనెల 4వ తేది వరకు లింగంపేట కస్తూర్బా పాఠశాలలో స్వీకరిస్తామని ఆమె తెలి యజేశారు.

కోటగిరిలో..

కోటగిరి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తాత్కాలిక పద్దతిలో సోషల్ సబ్జెక్టు బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిణి సవిత రాణి తెలిపారు. 6నుండి 10వ తరగతి వరకు సోషల్ సబ్జెక్టును ఇంగ్లీష్ మీడియంలో బోధించాల్సి ఉందన్నారు. సోషల్ సబ్జెక్టులో డిగ్రీ చదివి బీఈడీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్లారెడ్డిలో .

ఎల్లారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి కస్తూర్బా కళాశాలలో భౌతిక శాస్త్రం బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 4వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా పాఠశాల,కళాశాల ప్రత్యేక అధికారి వీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ ఫిజిక్స్, బీఈడీ చేసిన వారు దీనికి అర్హులని అన్నారు. ఇంటర్మీడియట్‌లో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి కస్తూర్బా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి వీణ తెలిపారు.

దోమకొండలో..

దోమకొండ, (బీబీపేట) డిసెంబరు (ఆంధ్రజ్యోతి):కేజీబీవీ బీబీపేటలో గెస్ట్ టీచర్ల నియామకం చేపట్టడం జరుగుతుందని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో సీఆర్‌టీ, ఇంగ్లీష్, సీఆర్‌టీ సోషల్ అర్హత బీఈడీ, కళాశాల స్థాయిలో పీజీసీఆర్‌టీ, మ్యాథ్స్, ఫిజిక్స్‌అర్హత బీఈడీ, పీజీ దరఖాస్తులకు చివరి తేదీ 4వరకు, పదవి కాలం ఈ విద్య సంవత్సరం మాత్రమే అన్నారు. దరఖాస్తులు కేజీబీవీ బీబీపేట నందు స్వీకరించబడునని తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన

వేల్పూర్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు సోమవారం వేల్పూర్‌లోని ఎంఆర్‌సీ వద్ద సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గతంలో సీఎం ఇచ్చిన హామీ ప్రకారం పాఠశాల విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉపాధ్యాయులను వెంటనే విద్యశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ చేసేంత వరకు వెంటనే టీఎస్ఎస్ఏ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది కృష్ణ, మూర్తి, శైలజ, మోలిక, జాన్సీరాణీ, శ్రీనివాస్, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో 2కే రన్

ఎల్లారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు అయిన ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలలో భాగంగా సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో అధికారులు, నాయకులు, విద్యార్థులు కలిసి అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ గాంధీ చౌక్ మీదుగా 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన కాలం లో ఇచ్చిన హామీలను అమలు చేసిందని రైతులకు రుణమాఫీ, సన్న రకం వడ్లకు బోనస్, మహాలక్ష్మీ పథకాలు ప్రజలకు అందుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం హయాం లోని అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెంజల్‌కు ఎమ్మెల్యే రాక

రెంజల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రెంజల్ మండల కేంద్రంలో గ్యాస్ గోదాం నుంచి శివాలయం వరకు రూ.6లక్షల వ్యయంతో మొరం రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపడతారని, రెంజల్ నుంచి బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వరకు రూ.20లక్షల వ్యయంతో చేపట్టే మొరం రోడ్డు పనులను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన లారీ, హర్వెస్టర్ ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా సోమవారం ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన గంగారాం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఆదివారం రాత్రి ట్రాక్టర్‌పై హర్వెస్టర్‌తో పెర్కిట్ నుంచి లక్కోరకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ రోడ్డు దాటి పొదల్లోకి పడిపోవడంతో పలువురికి గాయాలయ్యాయి. దీంతో సంఘటన స్థలాన్ని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పరిశీలించి గాయాలైన వారిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హార్వేస్టర్ డ్రైవర్ గంగారాం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

భీమ్‌గల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు

భీమ్‌గల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది అయినందున సోమవారం భీమ్‌గల్ పట్టణంలో మున్సిపాలిటీలో ప్రజాపాలన విజయోత్సవలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నెప్రేమ లత సురేందర్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, కౌన్సిలర్‌లు సీహెచ్.గంగాధర్, సతీష్‌గౌడ్, కోఆప్షన్‌సభ్యుడు అజ్మతుల్లా, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోయా రైతుల సమస్యలను పరిష్కరించాలి



సోయాపంటతో కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సాలూర మండలం హన్స సహకార సంఘం పరిధిలోని సోయాపంట రైతుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం గ్రామస్థులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోయాపంటతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని సొసైటీ చైర్మన్ మందర్నా రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోయాపంటను కోత కోసి ఆరబెట్టి రెండు నెలలు కావస్తున్న కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర 4892 కొనుగోలు చేస్తున్న సందర్భంలో మా ప్రాంతంలోని చాలా మంది రైతులు సోయాపంటను కోత కోయడం జరిగిందన్నారు. చేనుల్లో ఉన్న ఆకుల, అలుముల పసరు సోయాగింజలకు అంటుకుని కొంత రంగు మారిందని తెలిపారు. దీని మూలంగా సీడబ్ల్యూసీ సారంగపూర్ గోదాం అధికారులు సోయా లారీలను రిజక్ట్ చేసి తిప్పి పంపడం జరిగిందన్నారు. దీని మూలంగా ఈ సంవత్సరం ప్రైవేటు మార్కెట్‌లో క్వింటాలు సోయాకు రూ.4వేల నుంచి రూ.4200 చొప్పున దళారులు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని మూలంగా రైతులు క్వింటాలుకు రూ.800రూపాయల చొప్పున నష్టానికి గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు రైతుల పట్ల సానుకూలంగా స్పందించి హన్స సహకార సంఘం పరిధిలోని సోయాపంటను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ వినోద్ బాబా, సహకార సంఘం డైరెక్టర్లు ఖాజాపూర్ అశోక్, చింతం మైసయ్య, శంకర్‌తో పాటు హన్స, మందర్నా, ఖాజాపూర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులు చెల్లించాలని వృద్ధుల ధర్నా



రెంజల్‌లో ధర్నా నిర్వహిస్తున్న పింఛన్‌దారులు

రెంజల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి నెల అందిస్తున్న పింఛన్ డబ్బులను సకాలంలో అందించాలని కోరుతూ సోమవారం రెంజల్ మండల పరిషత్ కార్యాలయం ముందు వృద్ధులు ధర్నా నిర్వహించారు. వివిధ గ్రామాలలో పింఛన్ చెల్లిస్తున్నప్పటికీ రెంజల్ గ్రామంలో డబ్బులు చెల్లించడం లేదని గత రెండు రోజుల నుండి ఇతర గ్రామాలలో పింఛన్ అందిస్తున్న ఇక్కడ మాత్రం పింఛన్‌లు అందించడం లేదని, ప్రభుత్వం సకాలంలో పింఛన్ డబ్బులు అందిస్తున్న అధికారులు పంపిణీ చేయడంలో జాప్యం జరుగుతుందని, జాప్యం జరగకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో వెంకటేష్, సూపరిండెంట్ శ్రీనివాస్ త్వరలో పింఛన్ పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వృద్దులు శాంతించారు.

కోటగిరి మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ



మాజీ జడ్పీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మండవ వెంకటేశ్వర్ రావు

కోటగిరి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కోటగిరి మాజీ జడ్పీటీసీ శివరాజ్ దేశాయ్‌తో పాటు ఆయన తనయుడు రాజశేఖర్ దేశాయ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన కుటుంబాన్ని మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు పరామర్శించారు. శివరాజ్ దేశాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ జడ్పీటీసీ మృతి బాధకరని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్ కుమార్, మాజీ ఎంపీపీ గంగాధర్ రావు దేశాయ్, బీర్కూర్ మాజీ జడ్పీటీసీ సతీష్ తదితరులున్నారు.

రైతులు కూరగాయల పంట వైపు మొగ్గు చూపాలి

● జిల్లా వ్యవసాయ అధికారి శాఖ వాజీద్ హుస్సేన్



నీలాలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

రెంజల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రైతులు కూరగాయల పంట వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. సోమారం మండలంలోని నీలా గ్రామంలో రైతులకు కూరగాయల పంట సాగుపై అవగాహన కల్పించారు. తీగ జాతి పంటలైన బీర, కాకర, దొండ మొదలైన పంటల సాగు వైపు దృష్టి సారించాలన్నారు. కూరగాయల కోసం పెండల్స్(సిమెంట్ పోల్స్)ను సబ్సిడీపై అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో వ్యవసాయ అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, ఏఈవోలు సాయిలు, అజయ్, రైతులు ఎంఎల్ రాజు, రమేష్, మరియదాస్, తదితరులు పాల్గొన్నారు.

కలిగోట్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి ప్రవీన్

జక్రాన్‌పల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రవీన్ పరిశీలించారు. అంతకు ముందు పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వండి రుచికార భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు వివేక్‌నగర్‌తాండాలో అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం, గుడ్లు, పాలు, ప్రభుత్వం అందించే ఆహారపదార్థాలను అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, ఏంపీవో, ఉపాధ్యాయులు ఉన్నారు.

● సీఎం కప్‌పై సమావేశాన్ని నిర్వహించిన అధికారులు

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్‌పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ప్రవీన్, ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి, ఎంఈవో శ్రీనివాస్, ఎస్సై తిరుపతి, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, వివిధ పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చార్జీషీట్ విడుదల చేసిన బీజేపీ నాయకులు



ఆర్మూర్‌లో చార్జీషీట్ విడుదల చేసిన బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులు కాంగ్రెస్ సంవత్సర పాలనపై చార్జీషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అధికార ప్రతినిధులు జెస్సు అనిల్, కలిగోట్ గంగాధర్‌లు మాట్లాడుతూ నిధులు, నీళ్లు, నియమకాల పేరుపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11ఏళ్లుపూర్తయ్యిందని, రాష్ట్రంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని అన్నారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధిచెప్పి కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పజెప్పి ఇచ్చిన హామీను నెరవేర్చకుండా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి రూ.46వేల కోట్ల అప్పు చేశారని అన్నారు. గత పదేళ్ళలో కె టాక్స్ పేరిట ప్రస్తుతం ఆర్ఆర్ టాక్స్‌ల పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హాస్టళ్ళలో సరైన సదుపాయాలు లేక కలుషిత ఆహారంతో విద్యార్థుల తల్లిండ్రుల శాపానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరం పేరిట పండగ చేసుకోవడం కాదని, రాబోయే రోజుల్లో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శులు పొల్కం వేణు, పులి యుగందర్, మీసాల రాజేశ్వర్, దొండి ప్రకాష్, బండ్లపల్లి నర్సారెడ్డి, తోట నారాయణ, ఉదయ్‌గౌడ్, దక్షిణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు అభివృద్ధిలో పోటీపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు ఆర్మూర్ అభివృద్ధి చేయడంలో పోటీ పడాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డిపై ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకునేదిలేదని, అభివృద్ధికి కొరకు ఎల్లవేళల ప్రజలతో మమేకమై ప్రజల అవసరాలను తీరుస్తున్నారన్నారు. మీకు చిత్తశుద్ధింటే కేంద్ర ప్రభుత్వం నిధులు తీసుకురావాలని, అధికారులను బెదిరించడం సమంజసంకాదని, ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మోత్కురి లింగాగౌడ్, పండిత్‌పవన్, రవీందర్‌రెడ్డి, కొంతం మురళీ, ఫయాజ్, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఏడుగురు పేకాటరాయుళ్ళను అరెస్టు చేసినట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా ఏడుగురు పేకాట రాయుళ్లతో పాటు రూ.47వేల700 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని చలపాక అటవీ ప్రాంతంలో జరిగిన బుటకపు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సుధాకర్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ముందు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య పునరుద్దరణ, పౌర స్వేచ్చను కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఏడో గ్యారెంటీగా ప్రజలకు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సంవత్సరం కాలంలో దమరదొగు మొదలుకొని ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లు చేయడం దారుణమని అన్నారు.

రైతులను విడగొడుతున్న ప్రభుత్వం

వేల్పూర్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం విడగొట్టే ప్రయత్నాలు చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్ విమర్శించారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీలో భాగంగా రైతులకు లక్ష లోపు ఒక వర్గం, రెండు లక్షలు రైతులను మరోవర్గంగా వేరుచేసే ప్రయత్నం చేస్తున్నార న్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేయాలని డి మా ండ్ చేశారు. ఈనెల, ఆ నెల అనుకుంటూ రైతు భరోసా ఎగొ ట్టారన్నా రు. పెట్టుబడి లేక రైతులు నష్టపోయారన్నారు.

రేషన్ షాపు ప్రారంభం

నిజాంసాగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలాల్లోని జక్కాపూర్, వెలగనూరు, తుంకిపల్లి గ్రామాలలో సోమవారం రేషన్ షాపులను మండల పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ రవీందర్‌రెడ్డిలు ప్రారంభించారు.రేషన్ డీలర్లు డిసెంబరు నెల నుంచి సరుకులు ఇచ్చేందుకు రెవెన్యూ అధికార యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేశారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి మండలాల కార్యకర్తలు ఉన్నారు.

బీజేవైఎం నాయకుడికి పరామర్శ



బాధితున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్‌ను సోమవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరామర్శించారు. అరుణ్‌కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని యాశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్ళి ఆయనను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి అరుణ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి అడిగితెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

30పడకల ఆసుపత్రికి భూమి విరాళం



దాతను సన్మానిస్తున్న దృశ్యం

మోస్రా,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): చందూరు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం నిమిత్తం నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన మారుతీనగర్‌లో గల అర ఎకరం భూమిని గ్రామానికి చెందిన ముప్పానేని చంద్రావతి, విద్యాసాగర్ 30పడకల ఆసుపత్రి నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ప్రజల సౌకర్యార్థం 30పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిని విరాళంగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అద్యక్షుడు ప్యాయం అశోక్ యాదవ్, చందూర్ మండల మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దశగౌడ్, మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, కారేగాం మాజీ సర్పంచ్ దేవిసింగ్, మేడిపల్లి మాజీ సర్పంచ్ రవి, సహకార సంఘం డైరెక్టర్లు కల్లూరి రాంరెడ్డి, మదరపు రుక్మిణి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

జక్రాన్‌పల్లి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ గ్రా మంలో జేఎంకెపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల పారిశ్రామిక సంఘం సోమ వారం మార్క్‌ఫెడ్ చైర్మన్, ఇన్‌కో డైరెక్టర్ మార గంగారెడ్డి సందర్శించి పరిశీలిం చారు. అనంతరం నిర్మిస్తున్న పారిశ్రమ యంత్రాలను వివరాలు అడిగితెలుసుకు న్నారు. ఆయన వెంట జెఎంకెపీఎం ప్రధానడైరెక్టర్ తిరుపతిరెడ్డి, పెర్కిట్ నర్సారెడ్డి, గంగన్న ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆర్మూర్ పట్టణంలో ఇటీవల మృతి చెందిన తన బాల్యమిత్రుడు అశోక్ కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా డ్రైస్ వరల్డ్ మురళీ చౌళ అశోక్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

తప్పిన ప్రమాదం దగ్ధమైన కారు



మేనూర్ జాతీయ రహదారిపై ఆకస్మాత్తుగా నిప్పంటుకున్న కారు

మద్నూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రానికి దగ్గరలో జాతీయ రహదారిపై ఆకస్మాతుగా కారుకు నిప్పంటుకోవడంతో ప్రమాదం తప్పి అందులో ఉన్న వారు బయటకు వచ్చారు. సోమవారం మండల కేంద్రం నుంచి సరిపూర్ గ్రామానికి వెళుతున్న కారు డిజిల్ ట్యాంకు నుంచి డిజిల్ కారిపోవడంతో అది గమనించి అందులో ప్రయాణీకులు కారును పక్కకు నిలిపివేసిన బయటకు వచ్చారు. ఆకస్మాత్తుగా ఒక్కసారిగా కారులో మంటలు వ్యాపించడంతో కారు మంటల్లో దగ్ధమైంది. జహీరాబాద్ పార్లమెంట్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ బంధువులకు సంబంధించిన కారుగా పోలీసులు గుర్తించారు.

శానిటేషన్ పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌పరిధిలోని 23వ వార్డులో మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం సానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, పూర్ణమౌళి వార్డు ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

జక్రాన్‌పల్లి,, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో విద్యార్థులకు వడ్డించాలని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ, సూచ నలు, సలహాలు అందజేశారు. ఈసమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎం సు రేందర్‌రెడ్డి, కాంప్లెక్స్‌సిబ్బంది, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీసేవ

పెర్కిట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆద్వర్యంలో సోమవారం అయ్యప్ప, రామాలయం, దత్తాత్రేయ, ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, బట్టు శంకర్, చందేశీ శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, హాజరీ సురేష్, కొంతం మురళీ, ఆలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం కొత్తపల్లి (ఎస్) గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మొక్కల పెంపకం నర్సరీని సోమవారం వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న నర్సరీలో ఉపాధి కూలీలు బ్యాగ్ ఫిల్లింగ్ పనులను చేయడం జరుగుతుందని ఈజీఎస్ సిబ్బంది వైస్‌చైర్మన్ నర్సారెడ్డికి వివరించారు. ప్రతీ గ్రామపంచాయతీకి ఎనిమిది వేల మొక్కలు పెంచే విధంగా బ్యాగులు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ టీఏ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ, తదితరులు పాల్గొన్నారు.


మంగూర్ శివారు అటవీ ప్రాంతంలో కంచె లేని ప్రాంతం


రహదారి మధ్యలో మేత మేస్తున్న పశువులు (ఫైల్)


జుక్కల్ గుండా సాగుతున్న 161 జాతీయ రహదారి

ఆ రహదారి.. యమ డేంజర్!

● 161 జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు ● భద్రతపై వాహనదారుల సందేహం
● పశువుల సంచారంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయంటున్న స్థానికులు ● భద్రత పెంచాలని వాహనదారుల వేడుకోలు

పెద్దకొడప్‌గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజక వర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన 4 వరుసల రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఈ రహదారి గత 4 సంవత్సరాల నుంచి ప్రయాణానికి అందుబాటులోకి వచ్చింది. దీంతో ఈ రహదారిపై కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వాహనదారులతో పాటు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన వాహనదారులు నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఈ రహదారి వాహనాల రాకపోకలతో బిజీగా మారింది. రహదారిపై ప్రయాణం మురిపెంగా ఉన్న అంతే సంఖ్యలో వాహన ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జుక్కల్ నియోజక వర్గంలోని నిజాంసాగర్ మండలం గుండి ప్రారంభం అయిన ఈ రహదారి పిట్లం, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ మండలాల గుండా సుమారు 70 కిలోమీటర్ల మేర సాగుతుంది. రహదారి ప్రయాణానికి అనుకూలంగా ఉండటంతో వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో పశువులు సంచారంతోనే, అధిక వేగంతోనే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. నియోజక వర్గంలో ఈ రహదారిపై వారం రోజుల వ్యవధిలో ఒకటో, రెండో ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

రహదారిపైకి యథేచ్ఛగా పశువులు..

జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాల వేగం గరిష్ఠంగా వంద కిలోమీటర్లకు పైగా ఉండటంతో వాహనాలు అధిక వేగంతో వెళ్తుంటాయి, వాహనాలు వేగంగా వెళ్లే సమయంలో ముందు అకస్మాత్తుగా ఏదయిన వాహనం గాని, పశువులు గాని వస్తే వాహనం కంట్రోలు కాదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారిపైకి పశువులు రాకుండా హైవే భద్రత సిబ్బంది వారు గ్రామాల సమీపంలో కంచెను ఏర్పాటు చేశారు. అయినా కూడా అయా గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలను వాటి యజమానులు మేత కోసం జాతీయ రహదారిపైకి తీసుకవస్తున్నారు. దీంతో పశువులు అకస్మాత్తుగా రహదారి మధ్యలోకి రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత వారం రోజుల కిందట పిట్లం శివారులో రాత్రి సమయంలో రహదారిపైకి రెండు గేదెలు రావడంతో హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న లారీ గేదెలను ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందడంతో పాటు, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అంతేగాక గత రెండు నెలల కిందట చిన్న కొడప్‌గల్ వైపు నుండి పిట్లంకు చెందిన జబ్బార్ పిట్లం వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా గేదే అడ్డురావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అంతేగాక గత రెండు రోజు కిందట జుక్కల్ మండలం కౌలాస్ గేట్ ప్రాంతంలో బిచ్కుంద మండలం పెద్ద తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై చేనుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇలా రహదారిపై ప్రమాదాలు తరచుగా జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

అడ్డదిడ్డంగా రాకపోకలు.. పలు ప్రాంతాల్లో కంచె తొలగింపు

జాతీయ రహదారిపై ప్రయాణం సాఫీగా సాగేందుకు హైవే భద్రత సిబ్బంది పెట్రోలింగ్ వాహనాలు తిప్పుతుంటారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగితే సహాయం చేయడానికి పెట్రోలింగ్ చేసేవారు సహాయపడతారు. అయితే ఈ రహదారిపై వివిధ ప్రాంతాల్లో వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను ఇష్టం వచ్చిన చోటు నుండి హైవే మధ్యలో నుండి తీస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక ప్రమాదాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో కంచె లేకుండా ఉండటంతో ఆ వైపు నుంచి వచ్చే జంతువులు, పశువులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే వివిధ వ్యాపార వర్గాలకు వారు యథేచ్ఛగా కంచె తొలగించి తమ వ్యాపారాలు చేసుకుంటున్నారు. మంగ్లూర్ శివారులో అయితే ఓ హోటల్ వారు కంచెను తొలగించి అక్రమంగా లారీలకు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో లోపలి వైపు నుంచి వచ్చే రహదారి వాహనాలు వచ్చే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

భద్రత కల్పించాలని వాహనదారుల వేడుకోలు..

జాతీయ రహదారిపై ప్రయాణం సాఫీగా సాగేలా హైవే సిబ్బంది వారు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, మరిన్ని ప్రమాదాలు జరగకముందే హైవే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయం గురించి 161 జాతీయ రహదారి సేఫ్టీ ఇంజనీర్ బాల్‌రాజ్‌ను వివరణ కోరగా రహదారిపైకి ఆయా గ్రామాల ప్రజలు తమ పశువులను తీసుకరాకుండ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారిపైకి పశువులు, జంతువులు రాకుండ సిబ్బంది ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే కొంతమంది తమ సిబ్బంది లేని సమయంలో పశువులను మేత కోసం రహదారిపైకి తీసుకవస్తున్నారని, అటువంటి వారికి నోటీసులు ఇచ్చి పోలీసులకు వారిపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రహదారిని భద్రతగా ఏర్పాటు చేసిన కంచెను కొన్ని ప్రాంతాలలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని, వాటిని త్వరలో పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. అక్రమంగా కంచెను తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కారుకు అడ్డం వెళ్లి చనిపోయిన గేదె (ఫైల్)


కంచె తొలగించి అక్రమంగా లారీలు పార్కింగ్ చేసిన దృశ్యం


పిట్లం శివారులో గేదెలు అడ్డురావడంతో బోల్తాపడిన కారు (ఫైల్)


రహదారి మీదుగా వెళ్తున్న గొర్రెల మంద

జర దేఖో!!


లక్కోర ప్రభుత్వపాఠశాల ప్రహరీ సమీపంలో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


మోతె, వేల్పూర్ రహదారి సమీపంలో..

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● ఆందోళన చెందుతున్న ప్రజలు

వేల్పూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి కొట్టోచ్చినట్టు కనబడుతోంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, బోర్డుల చుట్టు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇనుప రక్షణ కంచెను ఏర్పాటు చేయాల్సి ఉన్న ఆవిషయం పట్టించుకోవడం లేదు లక్కోర, ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను, అలాగే మోతె, వేల్పూర్ వెళ్లే ప్రధాన రోడ్డు సమీపంలో, పచ్చలనడ్కుడ, వేల్పూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిని ఆనుకొని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ లకు రక్షణ కంచెను, బోర్డులు ఏర్పాటు చేయలేదు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌లకు చుట్టు రక్షణ కంచె లేకపోవడం, రోడ్డుకు కొంత ఎత్తులోనే ఉండడం, గద్దె కూడా సక్రమంగా లేక పోవడం ఐదర్ బండరాళ్ల లేదా, సిమెంట్ రింగుల వంటివి పెర్చి ఉండడంతో అవి ఎప్పుడు కులిపోతాయేనని, గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పచ్చలనడ్కుడ, లక్కోర గ్రామ రోడ్లలో ట్రాన్స్‌ఫార్మర్‌లు సమీపంలోనే పాఠశాల ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఈ దారిలోనే వెళ్తాంటారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా రక్షణ కంచెలు, బోర్డులు లేనివి దర్శనమిస్తాయి. రోడ్లకు ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడంతో వాహనాలు తగిలే ప్రమాదం ఉంది. చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్‌లు బోర్డులు లేకపోవడం వల్ల విద్యుత్ వైర్లు, ఫ్యూజ్‌లు బైటే ఉండి ప్రమాదకరంగా మారాయి. తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు అప్పుడప్పుడు జీవలు తగిలి విద్యుత్‌షాక్‌తో మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్లను అనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద వాహనదారులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న వాహనదారులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనే ప్రమదం ఉందని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ ట్రాన్స్ ఫార్మర్‌లు మరి ప్రమాదకరంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం విడనాడి ప్రమాదకర పరిస్థితులు ఉన్న చోట రక్షణ కంచెలు, బోర్డుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకొని సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.


పచ్చనలనడ్కుడలో పాఠశాల సమీపంలో..


వేల్పూర్, పచ్చలనడ్కుడ మధ్య వాగుబ్రిడ్జి సమీపంలో రోడ్డును ఆనుకొని..


పచ్చలనడ్కుడ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆంధ్రజ్యోతి పరిశీలన


భోజనశాలలో పార్కింగ్ చేసిన వాహనాలు

భోజనశాల

అందుబాటులోకి వచ్చేదెన్నడో..?!

● అసంపూర్తిగా నిర్మాణం ● మైదానంలోనే భోజనం చేస్తున్న విద్యార్థులు

సదాశివనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్మించిన భోజనశాఖ అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య అందించాలని ఆదర్శ పాఠశాలలను ఏర్పాటుచేసినప్పటికీ విశాలమైన స్థలాలు సేకరించి తరగతి గదుల్లో వసతులు ఏర్పాటుచేసినప్పటికీ మధ్యాహ్న భోజన శాలలను ఏర్పాటుచేయకపోవడంతో వర్షాకాలం వర్షం, వేసవి కాలంలో ఎండలో మైదానాలలో కూర్చొని భోజనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. భోజనం చేసే సమయంలో గాలివచ్చిన దుమ్ము దూళి విద్యార్థుల భోజనాలపై పడి విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

దాత సహాయంతో కొంత నిర్మాణం

అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు మధ్యాహ్నభోజనం చేస్తున్న తీరును చూసి రూ.4లక్షలను భోజనశాల నిర్మాణానికి అందించారు. ఆర్థిక సహాయం నిర్మాణంతో చేసిన భోజనశాఖ పూర్తికాకపోవడంతో మరిన్ని నిధులు అందజేస్తే విద్యార్థులకు మరింత మేలు జరగనుంది.

వాహన పార్కింగ్‌కు వినియోగం

దాతల ఆర్థికసహాయంతో నిర్మించిన భోజనశాల అర్థాంతరంగా మిగిలిపోవడంతో ఉపాధ్యాయులకు వాహన పార్కింగ్ షెడ్డుల మిగిలిపోయిందని ఆదర్శ పాఠశాలకు వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అన్నితెలిసిన ఉపాధ్యాయులే ఇలా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. రోజు షెడ్డును క్లీన్ చేయించి శుభ్రంగా ఉంచితే కనీసం కొంతమంది విద్యార్థులకు అయినా సగం నిర్మించిన షెడ్డు ఉపయోగపడుతుందని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.


ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నభోజనం అందుకుంటున్న విద్యార్థులు

నాణ్యతతో కూడిన కల్లు అమ్మాలి



శాంపిల్స్‌ను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ

రామారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రాల్లో, గ్రామాల్లో, తండాల్లో నాణ్యతతో కూడిన కల్లును అమ్మాలని కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ఎన్‌ఫోర్సుమెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడుముల్లా వెంకటేష్ పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, సదాశివనగర్, మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి, దగ్గి తదితర గ్రామాల్లో కల్లు దుకాణాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీలునిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి పొందిన దుకాణాల్లోనే కల్లును అమ్మాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై విచారణ అనంతరం కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు విష్ణు, అవినాష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం

కామారెడ్డిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించకపోవడంతో పాటు ఇతర నేరాలకు పాల్పడి డిపార్ట్‌మెంట్ సీజ్‌చేసిన క్లెయిమ్ చేయకుండా ఉన్న అనేక మోటారు వాహనాలు రవాణాశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీటీవో కార్యాలయం,కామారెడ్డి టీజీఎస్‌ఆర్‌టీసీ డిపో,కామారెడ్డి ఆర్‌టీఏ చెక్‌పోస్టులో సీజ్‌చేసిన వాహన యాజమానులకు నోటీసులు జారీచేసినప్పటికీ వారు తమ వాహనాలను రిలీజ్‌చేసుకోలేదని దీంతో ఆర్‌ఆర్ చట్టం ప్రకారం ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గుర్తించడానికి ఈ అన్‌క్లెయిమ్ వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14 న ఉదయం 11 గంటల నుంచి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఈ వేలం నిర్వహించబడుతోందని తెలిపారు. మిగిలిన సమాచారం కోసం రవాణాశాఖ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ట్రాన్స్‌పోర్ట్.తెలంగాణ.జీవోవి.ఇన్‌ను సందర్శించాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక

గాంధారి,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):గాంధారి మండలంలోని గౌరారం కలాన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రఘునాథ్,సరితలు రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, వ్యాయమ ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని బాలుర పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

'గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి'

బాన్సువాడటౌన్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడలో, కామారెడ్డి జిల్లాలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డా.గుమ్మడి వెన్నెల గద్దర్‌ను సోమవారం మాలమహానాడు నాయకులు అయ్యల సంతోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో మాలల హక్కుల సాధన సమితి రాష్ట్రవ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైశయ్య ఉన్నారు.

'డబ్బులు వసూలు చేసినవారిపై చర్య తీసుకోవాలి'

బాన్సువాడ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తాను ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడినని, రాష్ట్ర మహాసభలు ఉన్నాయంటూ కొందరు ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇది ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని ఎస్సీ, ఎస్టీ, జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వారు మా ట్లాడారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన రాష్ట్ర ఉపాధ్యక్షుడిపై రాష్ట్ర కార్యవర్గం చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమం లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారుశెట్టి హన్మాండ్లు, ఉపాధ్యక్షుడు కోటగిరి సతీష్, సీనియర్ పాత్రికేయులు ఎర్రవట్టి పోశిరాం, తదితరులు పాల్గొన్నారు.

'పోచారంపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి'

బీర్కూర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలపై బీర్కూర్ మండల మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ తీవ్రమైన వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సోమవారం బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామంలో వారు మాట్లాడారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పోచారం భాస్కర్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్యామల, వైస్ చైర్మన్ రాములు, మండల అధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, యూత్ అధ్యక్షుడు శశికాంత్, నాయకులు మోగులుగొండ, సానెపు గంగారాం, దుంపల రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై చిగురిస్తున్న ఆశలు

(ఐదవ పేజీ తరువాయి)

కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అనర్హురాలిగా ప్రకటిస్తారు. దరఖాస్తు దారుల్లో దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు 50శాతం,జనరల్ కోటా కింద 15శాతం కేటాయిస్తారు. గతంలో ఇండ్లు మంజూరైన,దళితబంధు పథకం పొందిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. సొంత స్థలం కనీసం ఒక గుంట భూమి పట్టా ఉండాలి. మంజూరు పత్రాలు అందిన తర్వాత నిర్మాణం ప్రారంభించవచ్చు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుంది. నాలుగుదశల్లో డబ్బులు విడుదల చేస్తారు. పునాది స్థాయిలో రూ.1లక్ష,రెండో దశలో రూ.1.25 లక్షలు, మూడోదశలో స్లాబ్‌కు రూ.1.75 లక్షలు,ఫినిషింగ్ దశలో మరో రూ.1లక్ష ఇస్తారు.

త్రిలింగ రామేశ్వరాలయం పరిశీలన

నాగిరెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాం దూర్ గ్రామంలో ఉన్న పురాతన శివాలయం అయిన త్రిలింగ రా మేశ్వర దేవాలయాన్ని సోమవారం పురావస్తుశాఖ అధికా రుల బృందం పరిశీలించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సిఫారసు మేరకు పురా వస్తు శాఖ అధికారుల బృందం ఆలయాన్ని సందర్శించి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలిం చారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తు, సభ్యులు శ్యామ్‌రావు, రమేష్, కిష్టయ్య, నీల సిద్ది రాములు, కిషన్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి



బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేస్తున్న అయ్యప్ప స్వాములు

బాన్సువాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై ఆగడాలు ఆపాలని అరెస్టు చేసిన ఇస్కాన్ ప్రతినిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. అయ్యప్ప ఆలయం నుంచి బైకుల మీదుగా ర్యాలీగా వెళ్లిన సేవా సమితి సభ్యులు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు హిందువుల ఐక్యతగా ఉండాలని నినాదాలు చేశారు. అనంతరం సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ శాంతిని కోరుకునే హిందువులపై దాడులను క్షమించరాని నేరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో బంగ్లా దేశ్‌పై ఒత్తిడి పెంచాలని అన్నారు. బంగ్లాదేశ్ విపత్తులో ఉన్నప్పుడు ఇస్కాన్ ప్రతినిధులు అక్కడ ఎన్నో సేవలు చేశారని, వారికి అన్న ప్రసాదం కూడా అందించారని అన్నం పెట్టిన వారిని అరెస్టు చేయడం శోచనీయమని అన్నారు. హిందువులు ఐక్యంగానే ఉంటేనే మనుగడ కొనసాగిస్తామని లేనిచో ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వాలు ఈ అంశంపై స్పందించకపోతే అన్ని ప్రాంతాలలో ఉద్యమాలు బయలుదేరుతాయని వారు హెచ్చరించారు. రోజురోజుకు బంగ్లాదేశ్‌లో హిందువుల మనుగడ కష్టమవుతుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. భారతదేశంలో మైనారిటీలకు హక్కులు ఇచ్చినట్లుగా బంగ్లాదేశ్‌లో కూడా ఇవ్వాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు కోనాల గంగారెడ్డి, ధనగారి కృష్ణారెడ్డి, మల్లికార్జున్, వీరప్ప, సిద్ది మహేష్, శంకర్‌గౌడ్, అరుణ్, దేవకి సురేష్, అరవింద్, మాణిక్యం గుప్త తదితరులు పాల్గొన్నారు.

● 4న హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

కామారెడ్డిటౌన్:బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తు ఈనెల 4 న హిందూఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీ గంజ్‌నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు శ్రీనివాస్, పవన్‌కుమార్ శర్మలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపైదాడులను నిరసిస్తు ఇస్కాన్ స్వామిజీ చిన్మయి ప్రభుదాస్ అరెస్ట్‌ను ఖండిస్తు ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల కు ర్యాలీ ప్రారంభమై కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పురవీధుల గుండా కొనసాగుతుందని తెలిపారు. కావున జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున హిందూబంధువులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బోర్లం మైనారిటీ గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి

బాన్సువాడ: బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో మైనారిటీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వార్డు సభ్యులు అక్బర్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రాన్ని అందజేశారు. మైనారిటీ గురుకులంలో స్టాఫ్ నర్సు లేకపోవడంతో విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందకపోవడంతో విద్యార్థినీలు జ్వరాల బారిన పడుతున్నారని, అలాగే గురుకుల పాఠశాలకు చుట్టూ పక్కల కాంపౌండ్ వాల్ లేక విద్యార్థినిలు భయ భ్రాంతులకు గురవుతూ చదువుకుంటున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయికి విన్నవించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా విద్యా ర్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని నూతనంగా స్టాఫ్ నర్సు నియమించి విద్యార్థులకు వైద్య సేవలు అందించాలని మాజీ వార్డు సభ్యులు అక్బర్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ కిరణ్మయి త్వరలోనే గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఒకవేళ గురుకుల పాఠశాలలో న్యాయం జరగకపోతే ధర్నా కార్యక్రమం చేపడతామని మాజీ వార్డు సభ్యులు అక్బర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ కాదర్, నజీమ్, ఇర్ఫాన్, అంబర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల, వసతి గృహాల పరిశీలన



విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరాతీస్తున్న చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 15,16 వ వార్డులో గల తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ వెనుకబడిన కళాశాల బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సౌకర్యాలు వినియోగించుకోవడంతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాంటిది పలు చోట్ల విద్యార్థులకు సమస్యలు ఎదురవుతున్నాయని తమ దృష్టికి రావడంతో పలు వసతి,గురుకుల పాఠశాల, కళాశాలలను పరిశీలిస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని వార్డెన్‌లకు సూచించారు. మెను ప్రకారం ఆకుకూరలు, కూరగాయాలు, గుడ్లు,పప్పు ఉండేట్లు చూడాలని, పాఠశాల సిబ్బందికి మంచినీటి సౌకర్యం కూడా ఉండేటట్లు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చాట్ల వంశీకృష్ణ, వనిత రామ్మోహన్, పిడుగుమమత తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా ప్రజావిజయోత్సవాలలో భాగంగా కామారెడ్డి నిజాంసాగర్ చౌరస్తా నుండి కళాభారతి వరకు నిర్వహించిన 2 కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ కమీషనర్ శ్రీహరి,టీపీఓ గిరిధర్, ఎస్‌ఐలు పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో అయ్యే వ్యయంలో ఒక శాతం సెస్‌గా వసూలుచేయాలి

కామారెడ్డిటౌన్,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):భవన నిర్మాణం,ఇతర నిర్మాణాలలో జరుగుతున్న వ్యయం విలువలో ఒక శాతం సెస్‌ను వసూలు చేసి కార్మికశాఖకు సమర్పించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయికారుల సమన్వయ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట ప్రకారం ప్రభుత్వ అధికారులు ఎవరైతే పనుల నిర్ణయించేవారు, నిర్మాణానికి అనుమతులు ఇచ్చే అధికారులు ఒక శాతం లేబర్ సెస్ వసూలుచేసి కార్మికశాఖ సంక్షేమబోర్డుకు జమచేయాలని తెలిపారు.ప్రతీ భవన నిర్మాణ కార్మికుడు కార్మికశాఖలో రూ.110చెల్లించి పేరు నమోదుచేసుకోవాలని తెలిపారు. ఈ నమోదు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాల అయిన కుమార్తె వివాహం, ప్రసుతి సహాయం పథకాలకు రూ.30 వేలు,ఆసుపత్రిల వారంరోజుల వరకు చేరినట్లయితే రూ.13500,పాక్షిక వైకల్యం పొందితే రూ.3నుంచి 5లక్షల వరకు, సహాజమరణంకు రూ.1లక్ష 30వేలు, ప్రమాద మరణానికి రూ.6లక్షల 30 వేలవరకు లబ్ధిపొందవచ్చనితెలిపారు.ఈసమావేశంలో అదనపుకలెక్టర్‌లు విక్టర్,శ్రీనివాస్‌రెడ్డి, సహాయకార్మిక కమిషనర్ కోటేశ్వర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు నిధుల మంజూరు

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో మౌళిక వసతుల కోసం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావ్ నిధులు మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతు డబుల్ బెడ్‌రూం కాలనీలో వసతుల కోసం 57 లక్షల 70 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ డిఈ మదుబాబు, ఏఈఈ శ్రీకాంత్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ రాచప్ప, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన కలిగి ఉండాలి



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

సదాశివనగర్,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాలికలు రక్తహీనతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వైద్యులు హరీష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని కుప్రియల్ జ్యోతిబాపూలే బాలికల వసతి గృహంలో సోమవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 6,7,8 తరగతుల విద్యార్థినిలకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనతపై ఒక్కొక్కరికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. రక్తహీనత కలిగిన బాలికలు తీసుకోవాల్సిన న్యూట్రిషన్‌లను వాడుకోవాలని వాటి విధానం ఎలా వాడాలో తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య,ప్రిన్సిపల్ నీరజ,గడిల భాస్కర్, ఏఎన్‌ఎం నీరజ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలి

రాజంపేట,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆర్థిక సర్వే త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని,గతంలో వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ధరణి విషయంలో తలమడ్ల,ఆరేపల్లి రైతులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, ఎంఈవో పూర్ణచందర్, ఏవో శృతి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ హౌసింగ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన



దోమకొండలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దోమకొండ,(బీబీపేట)డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):దోమకొండ, బీబీపేట మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో హౌజింగ్ కార్యాయలం ఏర్పాటుకు సోమవారం స్థలాన్ని పరిశీలించారు.రూ. 5లక్షలతో జిల్లా హౌజింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టెందుకు హౌజింగ్ కార్పొరేషన్ అధికారులు రెండు మండలాల్లో వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు ప్రవీణ్ కుమార్, పూర్ణచంద్రోదయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యునికి అవార్డు

ఎల్లారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు ఇ.రవీంద్రమోహన్ ఉత్తమ సేవలకు గాను క్రైట్నాఫ్ ప్రొడక్షన్ ఎల్‌ఎల్‌పీ వారిచే ఏషియన్ ఎక్సలెన్స్ అవార్డు అండ్ ఇంటర్నేషనల్ ఎమినెన్ను అవార్డు సోమవారం అందుకున్నారు. ఈ అవార్డు రావటం కోసం తనతో పాటు కృషి చేసిన హాస్పిటల్ సిబ్బంది, డాక్టర్స్, నర్సింగ్ ఆఫీసర్స్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్‌ను హాస్పిటల్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు సత్కరించారు.



అవార్డును అందుకుంటున్న డాక్టర్ రవీంద్ర మోహన్

రైతుల వివరాలు నమోదు



రైతులకు రూణామాఫీ వివరాలను తెలియజేస్తున్న ఏవో, ఏఈవోలు

దోమకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం చేపట్టిన 4వ విడత రుణమాఫీలో భాగంగా వివిధ అంశాలపై సోమవారం దోమకొండ రైతు వేదికలో ఏవో మణిదీపిక, ఏఈవోలు క్రిష్టారెడ్డి, మాన్యూషలతో కలసి రైతులకు వివరాలను తెలియజేశారు. 4వ విడత రుణమాఫీకి సంబంధించి బ్యాంక్ ఖాతా, ఆధార్‌లో పెర్లు సరిగా ఉన్నప్పటికి తమకు రుణమాఫీ కాలేదని అధికారులను ప్రశ్నించారు. దీంతో రైతులకు సబంధించిన వివరాలను అన్‌లైన్‌లో చెక్ చేయగా బ్యాంక్ ఖాతా, రుణగ్రహిత పేరు వేరుగా ఉన్నాయని చూపుతుందని రైతులు తెలిపారు. ఈ విషయమై ఏవోను వివరణ కోరగా రైతుల యొక్క వివరాలను పరిశీలిచడం జరిగిందని సక్రమంగా ఉన్నప్పటికి ఆన్‌లైన్‌లో మ్యాచ్ కావడం లేదని ఈ విషయాన్ని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రైతు వేదిక చేరుకుని రైతులను సముదాయించి,ఎక్కడ సమస్య ఉందో దాన్ని గుర్తించి అర్హులైన రైతుల యొక్క రుణమాఫీ అయ్యో విధంగా అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రైతులు బొమెర శ్రీనివాస్, లోలపు సిద్దరాములు, రాజు, దీకొండ రాజశేఖర్, రాజు, బట్టు స్వామి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా విద్యాశాఖాధికారి రాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి

బాన్సువాడటౌన్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6, 7న బాన్సువాడలో నిర్వహించబోయే జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి బాన్సువాడలో జిల్లా స్థాయి నిర్వహించడం జరుగుతందని, ప్రభుత్వ వ్యవసాయశాఖ , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసులబాల్‌రాజ్‌లు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారన్నారు.అదేవిధంగా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు , ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సహకరించి సైన్స్ ఫేర్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సిద్దిరామిరెడ్డి, బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావు , ఆయా మండలాల ఎంఈవోలు , ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి

పెద్ద కొడప్‌గల్,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సహకార సంఘ పరిధిలో రబీ సీజన్‌కు గాను ఎరువులు అందుబాటులో ఉంచాలని బిచ్కుంద ఇంచార్జి ఏడిఏ ఇంద్రసేన్ పేర్కొన్నారు. సోమవారం పెద్ద కొడప్‌గల్ సహకార సంఘంలో ఎరువుల రికార్డులు పరిశీ లించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏడిఏ మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్ గాను రైతులు పంటలు వేస్తున్నందున సరిపడ ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈకార్యక్రమంలో మండల ఏవో, సిఈవో లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామారెడ్డి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మీ నరసింహ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం 33కేవీ పోసానిపేట్ ఫీడర్‌పై విద్యుత్ పనులు జరుగుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మర్కల్ పోసానిపేట్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఈ విషయాన్ని ప్రజలు, రైతులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

మహిళా సంఘాల సభ్యులకు ప్రశంసా పత్రాలు

భిక్కనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మన్నె లక్ష్మీ, మన్నె విజయమహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని నిథమ్‌లో పదిరోజుల పాటు హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణ తీసుకున్నారు. ఈ మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం డీఆర్‌డీవో సురేందర్ ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు వ్యాపార రంగంలో ఆర్థిక పరిపుష్టి సాధించి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రమేష్‌బాబు, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు సోమవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధరించిన అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు కఠిన నియమ నిబంధనలతో అయ్యప్ప దీక్షను చేపట్టి అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. అయ్యప్ప స్వాములు ముందుగా అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడులు కట్టుకొని శబరిమలకు తరలివెళ్లారు.

ఎస్సీ,ఎస్టీ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నూతన కమిటీ ఎన్నిక



కొంగల వెంకటి

కామారెడ్డిటౌన్,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన ఎస్సీ,ఎస్టీ రాష్ట్రమహాసభలో రాష్ట్ర కమిటిని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన కొంగల వెంకటి, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా సంగారెడ్డికి చెందిన చవాన్ సుభాన్‌సింగ్,అసోసియేట్ అధ్యక్షుడు హన్మంత్, చంద్రశేఖర్, కన్నిరాం, బసప్ప,చంద్రశేఖర్, యాదయ్య, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాక్షులుగా క్యాకయ్య, కిష్టప్ప,మల్లేషం, నరేష్,హీరాలాల్,రాజన్న, విజయలక్ష్మీ, రమేష్, పాండురంగం, విజయ్‌కుమార్, బాలయ్య కార్యదర్శులు నారాయణ, ముఖేష్, అమృత, రాజన్న, గణేష్, సాయన్న, కృష్ణయ్య, సురేందర్, మహిళ కార్యదర్శులు ఉమారాణి,మీనా కుమారి,రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు సాయప్ప, గట్టయ్య, లింగన్నలతో కూడిన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటి 2026 వరకు కొనసాగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి తెలిపారు.

సోలార్ కంచెను చోరీ

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు2 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వడ్లం గ్రామంలో వ్యవసాయ బోరు బావుల వద్ద రక్షణ కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న సోలార్ విద్యుత్ కంచెను గుర్తు తెలియని దుండగులు చోరీ చేయడంతో రైతులు ఆందోళన చెంద తున్నారు. గ్రామ శివారు ప్రాంతంలో ఏదో ఒక చోట దుండగులు సోలార్ కంచెతో పా టు, స్టార్టర్లు, కేబుల్ వైర్లు, సోలార్ పంపు సెట్లు ఎత్తుకెలుతున్నారని తెలిపారు. పోలీ సు సిబ్బంది ఈ విషయంలో చర్యలు తీసుకుని దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - రోటీ కపడా రోమాన్స్
దర్శన్ - ఝాన్సీ ఐపీఎస్
ప్రియా 35 - అమరన్
ప్రియా 70 - మెకానిక్ రాకి

బాన్సువాడ

మహేశ్వరి - మెకానిక్ రాఖీ
వెంకటేశ్వర - కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్)

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	180	200
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

